సాక్షి విశాఖపట్నం

మంగళవారం । 22 । అక్టోబర్ । 2024



ఫిర్యాదులు రిపీట్ కాకూడదు

ఒకే సమస్యపై తరుచూ ఫిర్యాదులు రాకూడదని కలెక్టర్ హరేందిర ప్రసాద్ అధికారులను ఆదేశించారు. 8లో



జీవీఎంసీకి లాయల్టీ ఆదాయం

వాహనాలకు హెచ్‌పీసీఎల్ ఇంధనం వినియోగించడం ద్వారా జీవీఎంసీకి లాయల్టీ ఆదాయం సమకూరింది. 8లో



అడ్డగోలు బదిలీలపై విచారణ

పంచాయతీరాజ్‌లో బదిలీలపై జెడ్పీ సీఈవో విచారణ ప్రారంభించారు. జిల్లా అధికారుల నుంచి వివరాలు సేకరిస్తున్నారు. 8లో

న్యూస్‌రీల్

ఎస్‌బీఐ గోల్డ్ బాండ్ పథకానికి అప్పన్న బంగారం

4.380 కిలోల బంగారం అప్పగింత



ఎస్‌బీఐ బ్రాంచ్ మేనేజర్‌కి బంగారాన్ని అందిస్తున్న ఈవో త్రినాథరావు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి భక్తులు హుండీల్లో సమర్పించిన 4.380 కిలోల కచ్చా బంగారాన్ని సోమవారం దేవస్థానం అధికారులు నగరంలోని ఎస్‌బీఐ ప్రధాన బ్రాంచ్‌కి తరలించారు. అక్కడ కచ్చా బంగారాన్ని శుద్ధి చేశాక, స్వచ్ఛమైన బంగారం ఎంత వస్తుందో ఆ మేరకు ఎస్‌బీఐ గోల్డ్‌బాండ్ స్కీమ్ సర్టిఫికెట్‌ను దేవస్థానానికి అందిస్తారు. దేవస్థానం ఈవో వి.త్రినాథరావు, దేవదాయశాఖ రాజమహేంద్రవరం ఆర్‌జేసీ సుబ్బారావు, జ్యూవెలరీ వెరిఫికేషన్ ఆఫీసర్ పల్లమరాజు, సింహాచలం దేవస్థానం డిప్యూటీ ఈవో రాధ, ఏఈవోలు ఆనంద్‌కుమార్, రమణమూర్తి, గోల్డ్ స్మిత్ సాంబమూర్తి, గోల్డ్ అప్రైజర్ శ్రీనివాసరావు తదితరుల సమక్షంలో బంగారాన్ని ఎస్‌బీఐ ప్రధాన బ్రాంచ్ మేనేజర్ నరసింగరావుకి అందించారు. ఇప్పటి వరకు దేవస్థానానికి ఎస్‌బీఐ గోల్డ్‌బాండ్ స్కీమ్‌లో 45 కిలోల బంగారం ఉంది.

అన్నప్రసాద పథకానికి సినీ నిర్మాత రూ.3 లక్షల విరాళం



ఈవో త్రినాథరావుకి చెక్కు అందజేస్తున్న సినీ నిర్మాత రాజేష్ దండా

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి శాశ్వత అన్నప్రసాద పథకానికి సినీ నిర్మాత రాజేష్ దండా రూ.3 లక్షల విరాళాన్ని అందజేశారు. సోమవారం సింహగిరికి కుటుంబ సమేతంగా వచ్చిన ఆయన తన పేరిట రూ.1,00,116, తన భార్య అపర్ణ పేరిట రూ.1,00,116, కుమార్తెలు హాస్య, శాన్వి, హాస్య మూవీస్ బ్యానర్ పేరిట మరో రూ.1,00,116లు దేవస్థానం ఈవో వి.త్రినాథరావుకి చెక్కుల రూపంలో అందించారు. దేవస్థానం తరపున దాతకు స్వామి దర్శనం కల్పించి ప్రసాదం, శేషవస్త్రం అందజేశారు.

సాగునీటి సంఘాల ఎన్నికలకు నోటిఫికేషన్

మహారాణిపేట: జిల్లాలో సాగునీటి వినియోగదారుల సంఘాల ఎన్నికల కోసం సోమవారం నోటిఫికేషన్‌ను జాయింట్ కలెక్టర్ కె.మయూర్ అశోక్ విడుదల చేశారు. అనంతరం కలెక్టరేట్‌లో విలేకరులతో ఆయన మాట్లాడుతూ జిల్లాలో 29 సాగు నీటి వినియోగదారుల సంఘాలు ఉన్నాయన్నారు. వచ్చే నెల 6వ తేదీన సాగునీటి వినియోగదారుల సంఘాల వారీగా ఓటర్ల జాబితా విడుదల చేస్తామన్నారు. వీటిపై 11వ తేదీ నుంచి అభ్యంతరాలు స్వీకరిస్తామని, 13న తుది ఓటర్ల జాబితా విడుదల చేస్తామన్నారు. వచ్చేనెల 21 నుంచి 23వ తేదీ వరకు ఎన్నికలు నిర్వహిస్తామన్నారు. నీటి వినియోగదారుల సంఘాల్లో ఓటు హక్కు కలిగిన రైతుల జాబితా తయారు చేసే బాధ్యత తహసీల్దార్లకు అప్పగించామన్నారు.

నేటి నుంచి ఆధార్ అప్‌డేట్ కోసం ప్రత్యేక క్యాంపులు

మహారాణిపేట: ఆధార్ అప్‌డేట్ కోసం ఈనెల 22 నుంచి 25 వరకు గ్రామ, వార్డు సచివాలయ విభాగం ద్వారా ప్రత్యేక క్యాంపులు నిర్వహించాలని, ఇందుకు ఎంపీడీవోలు, జోనల్ కమిషనర్లు తగిన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఎం.ఎస్.హరేందిర ప్రసాద్ ఆదేశించారు. జిల్లాలో 2,91,628 మంది బయోమెట్రిక్ అప్‌డేట్ పెండింగ్‌లో ఉందని తెలిపారు. బయోమెట్రిక్ అప్‌డేట్, కొత్త ఎన్‌రోల్‌మెంట్(వయస్సు 0–5)లను తప్పకుండా చేయించుకోవాలన్నారు. సచివాలయ పరిధిలో నిర్వహించే క్యాంప్‌లను ప్రజలు వినియోగించుకోవాలన్నారు.

విమ్స్‌లో రొమ్ము క్యాన్సర్‌పై ఉచిత వైద్య శిబిరం నేడు

ఆరిలోవ: విమ్స్‌లో మంగళవారం రొమ్ము క్యాన్సర్‌పై ఉచిత వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు విమ్స్ డైరెక్టర్ డాక్టర్ రాంబాబు తెలిపారు. ఈ శిబిరంలో అంకాలజీ వైద్యులు మహిళలకు రొమ్ము క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు ఉచితంగా జరుపుతారన్నారు. దీంతో పాటు రొమ్ము క్యాన్సర్‌పై అవగాహన కల్పించనున్నట్లు పేర్కొన్నారు. ఈ శిబిరం ఓపీ బ్లాక్‌లో ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు ఉంటుందని తెలిపారు.

అమర వీరుల త్యాగం.. అజరామరం



అమర వీరుల స్థూపం వద్ద సెల్యూట్ చేస్తున్న సీపీ శంఖబ్రత బాగ్చి , కలెక్టర్ హరేందిర ప్రసాద్, ఎంపీ గొల్ల బాబూరావు, ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు, పోలీసు అధికారులు (ఇన్‌సెట్) అమర వీరుల కుటుంబ సభ్యులకు చెక్కులను అందజేస్తున్న సీపీ శంఖబ్రత బాగ్చి



అమర వీరులకు నివాళి



పోలీసుల కవాతు

- నగర పోలీసు కమిషనర్ శంఖబ్రత బాగ్చి
- పోలీసు అమరవీరులకు ఘన నివాళి

ఏయూక్యాంపస్ : పోలీసు అమరవీరుల త్యాగం అజరామరమని నగర పోలీసు కమిషనర్ శంఖబ్రత బాగ్చి అన్నారు. సోమవారం పోలీసు అమరవీరుల సంస్మరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని బీచ్‌రోడ్డులోని పోలీస్ మెస్ ఎదురుగా గల అమర వీరుల స్థూపం వద్ద జిల్లా అధికారులతో కలిసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ పోలీసు అమరవీరుల త్యాగాలు మరువలేనివన్నారు. ప్రజల భద్రతే పరమావధిగా అంకితభావంతో పోలీసులు విధి నిర్వహణ చేస్తున్నారన్నారు. కానిస్టేబుల్, హోం గార్డు ఉద్యోగాల భర్తీకి కృషిచేస్తున్నామని, పోలీసులకు గ్రూపు ఇన్సూరెన్స్‌ను వర్తింపు చేస్తున్నామన్నారు. మహిళల భద్రతకు అత్యధిక ప్రాధాన్యత ఇస్తున్నామని తెలిపారు. **విశాఖలో ఏఐ ఆధారిత ఈ చలాన్ వ్యవస్థను** ప్రయోగాత్మకంగా అమలు చేస్తున్నామని చెప్పారు. గంజాయి నార్కోటిక్స్ కట్టడికి డైనమిక్, మొబైల్ చెకింగ్‌లు చేపడుతున్నామన్నారు. త్వరలో జాగిలాలు సైతం దీనిలో భాగమవుతాయన్నారు. పోలీసు సిబ్బంది విధి నిర్వహణతోపాటు ఆరోగ్యం, కుటుంబంపై శ్రద్ధ చూపాలన్నారు. దేశ వ్యాప్తంగా అమరులైన 216 మంది పోలీసుల పేర్లను చదివి వారికి నివాళులర్పించారు. అనంతరం అమర వీరుల కుటుంబ సభ్యులకు చెక్‌లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఆలపాటి గిరిధర్, కలెక్టర్ ఎం.ఎస్ హరేందిర ప్రసాద్, జీవీఎంసీ కమిషనర్ డాక్టర్ పి.సంపత్ కుమార్, డీసీపీలు అజిత వేజెండ్ల, మేరీ ప్రశాంతి, లతా మాధురి, ఎంపీ గొల్ల బాబూరావు, ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు, కేజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ శివానంద్, ఏఎంసీ ప్రిన్సిపాల్ డాక్టర్ బుచ్చిరాజు, పోలీసు అధికారులు, విశ్రాంత పోలీసు అధికారులు పాల్గొన్నారు. ట్రాఫిక్, ఏఆర్, సివిల్ పోలీసులు పరేడ్‌లో పాల్గొని అమరవీరులకు నివాళులర్పించారు.

మాయా ప్రణాళిక!

- వీఎంఆర్‌డీఏ పరిధిలో 184 అక్రమ లేఅవుట్ల గుర్తింపు
- చర్యలకు మీనమేషాలు లెక్కిస్తున్న అధికారులు
- ఇప్పటికే చాలా లేఅవుట్లలో సగానికి పైగా పూర్తయిన విక్రయాలు
- ఆనందపురం, భీమిలి, పద్మనాభంలో అనుమతులు లేకుండా 20 లేఅవుట్లు
- అనకాపల్లి, విజయనగరం జిల్లాలో భారీగా ఉన్నట్లు నిర్ధారణ



విశాఖ సిటీ: పుట్టగొడుగుల్లా పుట్టుకొచ్చిన అక్రమ లేఅవుట్లపై చర్యలకు వీఎంఆర్‌డీఏ అధికారులు మీనమేషాలు లెక్కిస్తున్నారు. వీఎంఆర్‌డీఏ పరిధిలో వందల ఎకరాల్లో అనధికార లేఅవుట్లు గుర్తించి ఏళ్లు గడుస్తున్నా వాటి వైపు కన్నెత్తి చూడడం లేదు. వీఎంఆర్‌డీఏ కమిషనర్ కె.ఎస్.విశ్వనాథన్ హెచ్చరికలతో ప్రణాళిక అధికారులు ఆ జాబితాను వెబ్‌సైట్‌లో ప్రకటించినప్పటికీ.. ఆ లేఅవుట్లపై ఇప్పటి వరకు ఎటువంటి నిర్ణయం తీసుకోకపోవడం గమనార్హం. ఇప్పటికే అందులో అనేక ప్లాట్ల విక్రయాలు జరిగిపోయాయి. కొనుగోలు చేసిన వారి పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. ప్రస్తుతం ఆయా లేఅవుట్లలో ప్లాట్ల రిజిస్ట్రేషన్లను నిలుపుదల చేశారు.

నిద్రలో ప్రణాళికాధికారులు

వీఎంఆర్‌డీఏ పరిధిలో 184 అనధికార లేఅవుట్లు ఉన్నట్లు అధికారులు గుర్తించారు. **వందల ఎకరాల్లో అనధికారికంగా లేఅవుట్లు అభివృద్ధి చేస్తున్నా.. వీఎంఆర్‌డీఏ ప్రణాళిక విభాగం అధికారులు పట్టించుకోలేదు. గత ప్రభుత్వ ఆదేశాలతో తప్పనిసరి పరిస్థితుల్లో ఈ అక్రమ లేఅవుట్ల గుర్తింపు ప్రక్రియను చేపట్టారు. సర్వే నిర్వహించి ఈ అనధికార** లే అవుట్ల జాబితాను సిద్ధం చేసినప్పటికీ.. వాటిని అభివృద్ధి చేసిన భూ యజమానులు, డెవలపర్లపై ఎటువంటి చర్యలు తీసుకోకపోగా.. మూడు నెలల క్రితం వరకు వాటి వివరాలను సైతం బహిర్గతం చేయలేదు. వీఎంఆర్‌డీఏ కమిషనర్‌గా కె.ఎస్.విశ్వనాథన్ బాధ్యతలు చేపట్టిన తరువాత అనధికార లేఅవుట్లపై దృష్టి పెట్టారు. మళ్లీ అక్రమ అవుట్లపై సర్వే చేయించి ఆ జాబితాను వెబ్‌సైట్‌లో పొందుపర్చాలని ఆదేశాలు జారీ చేశారు. అలాగే వాటి రిజిస్ట్రేషన్లు నిలిపివేసేలా చర్యలు తీసుకున్నారు. దీంతో ప్రణాళిక విభాగం అధికారులు ఆలస్యంగా మేల్కొని ఆ జాబితాను వీఎంఆర్‌డీఏ వెబ్‌సైట్‌లో ప్రకటించారు.

15 ఎకరాలకు పైబడి వేసిన అనధికార లేఅవుట్లు

మండలం	గ్రామం	విస్తీర్ణం
కశింకోట	బయ్యవరం	403
సబ్బవరం	ఆరిపాక	189.5
వేపాడ	వేపాడ	70.86
విజయనగరం	కణపాక అయ్యన్నపేట	62.20
భోగాపురం	భోగాపురం వెస్ట్	47
కొత్తవలస	ఉత్తరాపల్లి	35.91
బొండపల్లి	కనిమెరక	31.36
గంట్యాడ	రామవరం	27.04
పాయకరావుపేట	పాయకరావుపేట	27
కొత్తవలస	చీపురువలస	19.83
సబ్బవరం	బాటజంగాలపాలెం	18.91
సబ్బవరం	సబ్బవరం	17.79
కొత్తవలస	చింతలపాలెం	17.74
వేపాడ	వేపాడ	16.92
జామి	లక్ష్మీపురం	16.9
పరవాడ	పెదముషిడివాడ	16.8
విజయనగరం	కణపాక అయ్యన్నపేట	15.81

పక్కా 'ప్లానింగ్'తో..

విశాఖలో ఆనందపురం, భీమిలి, పద్మనాభం మండలాల్లో 20 అక్రమ లేఅవుట్లు ఉన్నాయి. ఆనందపురంలో దబ్బంద, కుసులువాడ, గొట్టిపల్లి, పెద్దిపాలెం, వేములవలస, కొలవానిపాలెం, కనమం, పెద్దిపాలెంలోను, భీమిలిలో బోడమెట్టపాలెం, తాళ్లవలస, మజ్జివలసలోను, పద్మనాభంలో ఏడు ప్రాంతాల్లో మొత్తం 78 ఎకరాల్లో ప్లాట్లను అభివృద్ధి చేసినట్లు గుర్తించారు. వీఎంఆర్‌డీఏ నుంచి ఎటువంటి అనుమతులు లేకుండా గజం రూ.15 వేలు నుంచి రూ.22 వేలు వరకు విక్రయిస్తున్నారు. అలాగే అనకాపల్లి, విజయనగరం జిల్లాల్లో వంద ఎకరాల విస్తీర్ణాల్లో అనధికార లేఅవుట్లు వేయడం విశేషం. అనకాపల్లి జిల్లాలో కశింకోట మండలం బయ్యవరం గ్రామంలో సర్వే నెంబర్ 195/2లో 403 ఎకరాల్లో ఎటువంటి అనుమతులు లేకుండా లేఅవుట్‌ను సిద్ధం చేశారు. అదే జిల్లా సబ్బవరం మండలం ఆరిపాకలో 121/2లో 189.5 ఎకరాల్లో అనుమతులు లేకుండా లేఅవుట్ వేశారు. ఒక్క సబ్బవరం మండలంలోనే 42 అక్రమ లేఅవుట్లు ఉన్నాయి. అదే విధంగా పెందుర్తి, చోడవరం, నాతవరం, పాయకరావుపేట, ఎస్.రాయవరం, రాంబిల్లి, పరవాడ, నక్కపల్లి, మునగపాక, అచ్యుతాపురం, కశింకోట మండలాల్లో కూడా అనుమతులు లేని అవుట్లను గుర్తించారు. వీటితో పాటు విజయనగరం జిల్లాలో భోగాపురంలో 47 ఎకరాల్లోను, కొత్తవలస, పూసపాటిరేగ, ఎస్.కోట, బొండపల్లె, గంట్యాడ, జామి, లక్కవరపుకోట, వేపాడ, విజయనగరం మండలాల్లో కూడా అనేక చోట్ల అనధికార లేఅవుట్లు సిద్ధం చేశారు.

చర్యలు శూన్యం

ఈ అనధికార లేఅవుట్లను అధికారులు గుర్తించి ఏళ్లు గడుస్తున్నాయి. ఇప్పటి వరకు వాటిపై ఎటువంటి చర్యలు తీసుకోకపోవడం గమనార్హం. ఇప్పటికే ఈ లేఅవుట్లలో అనేక మంది ప్లాట్లను కొనుగోలు చేశారు. ప్రస్తుతం వీరి పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. వందల ఎకరాల్లో అనుమతులు లేకుండా లేఅవుట్లు అభివృద్ధి చేస్తున్న సమయంలో అధికారులు నిద్ర నటించారన్న ఆరోపణలు ఉన్నాయి. వారి నిర్లక్ష్యం, కొనుగోలుదారులకు శాపంగా పరిణమించింది. ఈ అనధికార లేఅవుట్ల డెవలపర్లపై ప్రణాళిక విభాగం అధికారులు ఇప్పటి వరకు ఎటువంటి చర్యలు తీసుకోకపోవడం విశేషం. పంచాయతీ కార్యదర్శుల ద్వారా కొంత మందికి నోటీసులు జారీ చేసి చేతులు దులుపుకున్నారు. వారిపై ఎటువంటి చర్యలు తీసుకోలేదు. మరోవైపు ఈ లేఅవుట్లలో ప్లాట్లు కొనుగోలు చేసిన వారు మాత్రం తమకు న్యాయం చేయాలని వేడుకుంటున్నారు.

బాల కార్మికులను గుర్తించేందుకు ప్రత్యేక డ్రైవ్



మాట్లాడుతున్న కలెక్టర్ హరేందిర ప్రసాద్

మహారాణిపేట : జిల్లాలో బాల కార్మికులను గుర్తించేందుకు నెల రోజుల పాటు ప్రత్యేక డ్రైవ్ చేపట్టాలని టాస్క్‌ఫోర్స్ కమిటీ సభ్యులను, కార్మికశాఖ అధికారులను కలెక్టర్ ఎం.ఎస్.హరేందిర ప్రసాద్ ఆదేశించారు. కలెక్టరేట్‌లో సోమవారం ఆయన మాట్లాడుతూ కార్మిక శాఖకు అన్ని విభాగాల అధికారులు పూర్తి తోడ్పాటు అందించాలని సూచించారు. నెల రోజుల పాటు జిల్లా పరిధిలోని అన్ని కంపెనీలు, వ్యాపార సంస్థలు, దుకాణాలు, ఫ్యాక్టరీలు, ఇతర పరిశ్రమలను తనిఖీ చేయాలని, అక్కడ పని చేసేవారి వివరాలను సేకరించాలని చెప్పారు. ఎన్‌సీపీసీఆర్ మార్గదర్శకాలకు అనుగుణంగా 14 ఏళ్ల లోపు వాళ్లు ఎక్కడా కూడా పనిచేయడానికి వీలు లేదన్నారు. 15 నుంచి 18 ఏళ్ల వయసు గల వారు ప్రమాదకర కంపెనీల్లో పనిచేయడానికి వీలులేదని పేర్కొన్నారు. కార్యక్రమంలో డీఆర్వో కె.మోహన్ కుమార్, కార్మిక శాఖ ఉప కమిషనర్ సునీత, డీఈవో చంద్రకళ, బీసీ వెల్ఫేర్ అధికారిణి శ్రీదేవి, డీఎంహెచ్‌వో డాక్టర్ పి.జగదీశ్వరరావు, ఐసీడీఎస్, పోలీసు తదితర శాఖల అధికారులు పాల్గొన్నారు.

25న జిల్లా అభివృద్ధిపై ఇన్‌చార్జి మంత్రి సమీక్ష

మహారాణిపేట: జిల్లా అభివృద్ధిపై ఈ నెల 25వ తేదీన జిల్లా ఇన్‌చార్జి మంత్రి డోలా శ్రీబాల వీరాంజనేయస్వామి సమీక్ష నిర్వహిస్తారని కలెక్టర్ ఎం.ఎస్.హరేందిర ప్రసాద్ తెలిపారు. జిల్లాలో చేపట్టిన అభివృద్ధి ప్రాజెక్టులు, అమలవుతున్న సంక్షేమ పథకాలు, పరిపాలనాపరమైన అంశాలపై చర్చిస్తారని పేర్కొన్నారు. అన్ని విభాగాల హెచ్‌వోడీలు సంబంధిత శాఖల్లో చేపట్టిన పనులు, సాధించిన విజయాలపై పూర్తిస్థాయి నివేదికలతో హాజరు కావాలన్నారు. అదే రోజు ఉదయం ఆనందపురం మండల పరిధిలోని సి.కన్వెన్షన్ హాలులో భీమిలి నియోజకవర్గ అభివృద్ధిపై సమీక్ష జరుగుతుందని కలెక్టర్ తెలిపారు. వివిధ విభాగాల ఆధ్వర్యంలో నియోజకవర్గంలో చేపట్టిన అభివృద్ధి పనులు, సంక్షేమ అంశాలపై సమీక్ష ఉంటుందన్నారు.

జెడ్పీ సమావేశానికి పక్కా నివేదికలతో రండి

మహారాణిపేట: జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశానికి అధికారులు పక్కా నివేదికలతో హాజరు కావాలని కలెక్టర్ ఎం.ఎస్.హరేందిర ప్రసాద్ ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో ఆయన మాట్లాడుతూ గత సమావేశంలో ఆయా శాఖల పరిధిలో ప్రస్తావించిన అంశాలు, తీసుకున్న చర్యలపై పూర్తిస్థాయి నివేదిక సిద్ధం చేయాలని సూచించారు. గతంలో సభ్యులు లేవనెత్తిన ప్రజా సమస్యలపై చేపట్టిన చర్యలను వివరించాలని చెప్పారు. ఈనెల 24న జెడ్పీ వేదికగా జరిగే సర్వసభ్య సమావేశంలో ప్రజా ప్రతినిధులు, అధికారులు భాగస్వామ్యమై విజయవంతం చేయాలని విజ్ఞప్తి చేశారు.

జీవన్ జ్యోతి, సురక్ష బీమాపై అవగాహన కల్పించండి

మహారాణిపేట: ప్రధాన మంత్రి జీవన్ జ్యోతి బీమా యోజన, ప్రధాన మంత్రి సురక్ష బీమా యోజన పథకాల ఆవశ్యకతను, ప్రయోజనాలను ప్రజలకు వివరించాలని కలెక్టర్ ఎం.ఎస్.హరేందిర ప్రసాద్ సంబంధిత అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో ఆయన మాట్లాడుతూ జనవరి 15 వరకు ప్రత్యేక క్యాంపెయిన్ జరుగుతుందని పేర్కొన్నారు. దీనిలో భాగంగా గ్రామాల్లో 18 ఏళ్లు నిండిన కార్మికులు, యువత, మహిళలు, స్వయం ఉపాధి పొందే కార్మికులను చేర్పాలని అధికారులను ఆదేశించారు. 18–50 ఏళ్ల లోపు గల వారు రూ.436 ప్రీమియం చెల్లించటం ద్వారా జీవన్ జ్యోతి బీమా యోజనలో, 18–70 ఏళ్ల వయసు కలిగిన వారు రూ.20 చెల్లించటం ద్వారా సురక్ష బీమా యోజనలో చేరవచ్చని సూచించారు.

అధ్యయన యాత్రకు కార్పొరేటర్ల పయనం



విమానాశ్రయం వద్ద మహిళా కార్పొరేటర్లు

డాబాగార్డెన్స్: జీవీఎంసీ కార్పొరేటర్లు అధ్యయన యాత్రకు సోమవారం పయనమయ్యారు. వాతావరణం అనుకూలించకపోవడంతో మధ్యాహ్నం బయలుదేరాల్సిన వీరంతా రాత్రి 7 గంటల ప్రాంతంలో విశాఖ విమానాశ్రయం నుంచి బెంగుళూరు చేరుకున్నారు. అధ్యయన యాత్రకు 85 మంది కార్పొరేటర్లు ఆసక్తి చూపించినప్పటికీ 71 మంది వెళ్లారు. వీరితో పాటు 14 మంది జీవీఎంసీ సిబ్బంది, ఒక డాక్టర్ ఉన్నారు. అధ్యయన యాత్ర కో–ఆర్డినేటర్‌గా జీవీఎంసీ సెక్రటరీ బి.వి.రమణ వ్యవహరిస్తున్నారు.

టూర్ సాగేదిలా.. : ఈ నెల 22న ఉదయం 10 గంటలకు బెంగుళూరు మున్సిపల్ కార్పొరేషన్ ద్వారా అమలవుతున్న ఆధునిక మురుగు నీటి నిర్వహణ, మంచినీటి సరఫరా తదితర వాటిపై కార్పొరేటర్లకు అవగాహన కల్పిస్తారు. మధ్యాహ్నం భోజనం అనంతరం అక్కడి పర్యాటక ప్రాంతాలు సందర్శించనున్నారు. 23న బెంగుళూరు నుంచి మైసూరు వెళ్తారు. మధ్యాహ్నం 3 గంటలకు మైసూరు మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయంలో వివిధ అభివృద్ధి పనులను పరిశీలిస్తారు. అనంతరం స్థానికంగా ఉండే సందర్శన స్థలాలు సందర్శించనున్నారు. 24న మైసూరు నుంచి బంధీపూర్ వెళ్లి అక్కడ అభయారణ్యం, పర్యాటక ప్రాంతాలను సందర్శించనున్నారు. 25న బంధీపూర్ నుంచి ఊటీ వెళ్లనున్నారు. ఊటీతో పాటు కూనూర్‌ను సందర్శించనున్నారు. 26న ఊటీ నుంచి బెంగుళూరు వచ్చి, అక్కడి నుంచి పానాజీ వెళ్లనున్నారు. 27న పానాజీ చారిత్రాత్మక పర్యాటక ప్రాంతాలు సందర్శించనున్నారు. 28న ఉదయం 10 గంటలకు పానాజీ మున్సిపల్ కార్పొరేషన్‌లో అమలవుతున్న ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంపై అవగాహన చేయనున్నారు. అనంతరం విశాఖపట్నం రానున్నారు.

సంపద సృష్టికి మ్యూచువల్ ఫండ్స్ మంచి మార్గం

- మ్యూచువల్ ఫండ్స్‌లో పారదర్శకత, భద్రత ఎక్కువ
- రిటర్న్స్, విత్‌డ్రా ఎంతో సులభం
- ఎప్పుడైనా పెట్టుబడిని తిరిగి పొందొచ్చు
- ప్రతి నెలా పెన్షన్ రూపంలో నగదు పొందవచ్చు
- ఏఎంఎఫ్ఐ చీఫ్ ఎగ్జిక్యూటివ్ వెంకట నాగేశ్వర్



ఏయూ క్యాంపస్ : మన కోసం మనం సంపదను సృష్టించుకోవాల్సిన అవసరం ఉందని, ఇందుకోసం మ్యూచువల్ ఫండ్స్ ఒక మంచి మార్గమని అసోసియేషన్ ఆఫ్ మ్యూచువల్ ఫండ్స్ ఇన్ ఇండియా (ఏఎంఎఫ్ఐ) చీఫ్ ఎగ్జిక్యూటివ్ వెంకట నాగేశ్వర్ చలసాని చెప్పారు. ఆయన సోమవారం ఇక్కడ ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ.. మ్యూచువల్ ఫండ్స్‌లో పారదర్శకత ఎక్కువని, భద్రత ఎక్కువని, రిటర్న్స్, విత్‌డ్రా ఎంతో సులభమని వివరించారు. మ్యూచువల్ ఫండ్ సంస్థల్లో నిపుణులు లోతుగా అధ్యయనం చేసి మంచి సంస్థల్లో పెట్టుబడి పెడతారన్నారు. అవసరమైనప్పుడు మన పెట్టుబడిని తిరిగి పొందొచ్చని తెలిపారు. మ్యూచువల్ ఫండ్స్‌లో దాదాపు 15 శాతం వరకు రాబడి సాధిస్తున్నారన్నారు. పదవీ విరమణ ప్లాన్‌లు సైతం దీనిలో ఉన్నాయని వివరించారు. ప్రతి నెలా పెన్షన్ రూపంలో నగదు పొందవచ్చని అన్నారు. ఏఎంఎఫ్ఐ ఆంధ్రప్రదేశ్ సహా మూడు రాష్ట్రాలను దత్తత తీసుకుందని చెప్పారు. మిడ్, స్మాల్ క్యాప్‌లో లాభాలు ఆశాజనకంగా ఉన్నాయని, వీటిలో పెట్టుబడులు పెరిగాయని వివరించారు.

ఆర్థిక అక్షరాస్యత పెంచుతున్నాం

ప్రజల్లో ఆర్థిక అక్షరాసత్య పెంచడమే లక్ష్యంగా తమ సంస్థ పలు కార్యక్రమాలు చేపడుతోందని చెప్పారు. దేశంలో అక్షరాస్యుల సంఖ్య 70 శాతానికి పైగా ఉండగా, ఆర్థిక అక్షరాస్యత 21 – 22 శాతం మాత్రమే ఉందన్నారు. ఆర్థిక అక్షరాస్యతను పెంచడం ద్వారా ప్రజల్లో పెట్టుబడులపై అవగాహన పెరుగుతుందని తెలిపారు. మన దేశంలో 44 శాతం వరకు పెట్టుబడులు రియల్ ఎస్టేట్ రంగంలో, 22 శాతం బంగారంపై ఉన్నాయన్నారు. ప్రపంచవ్యాప్తంగా మ్యూచువల్ ఫండ్స్‌లో 65 శాతం పెట్టుబడులు ఉండగా భారత్‌లో మాత్రం 19.7 శాతం మాత్రమే ఉన్నాయని, వీటిని మరింత పెంచుతున్నామని చెప్పారు. ఈ ఫండ్స్‌లో రూ.500 నుంచి పెట్టుబడి పెట్టొచ్చని, త్వరలో దీనిని రూ.250కి తగ్గించేందుకు ప్రయత్నం చేస్తున్నామని తెలిపారు. దేశవ్యాప్తంగా 5 కోట్ల మంది ఈ రంగంలో పెట్టుబడి పెడుతున్నారని, 21 కోట్ల ఫోలియోలు ఉన్నాయని, ప్రస్తుతం రూ. 67.09 లక్షల కోట్ల పెట్టుబడులు ఉన్నాయన్నారు.


మొదటి స్థానంలో ఎస్‌బీఐ మ్యూచువల్ ఫండ్స్

ఎస్‌బీఐ మ్యూచువల్ ఫండ్స్ ఇండియాలో మొదటి స్థానంలో నిలుస్తోందన్నారు. దేశవ్యాప్తంగా 44 అసెట్ మేనేజ్‌మెంట్ సంస్థలు పనిచేస్తున్నాయని, వీటిపై సెబీ పర్యవేక్షణ ఉంటుందన్నారు. సెబీకి, అసెట్ మేనేజ్‌మెంట్ సంస్థలకు మధ్య అనుసంధానంగా ఏఎంఎఫ్ఐ పనిచేస్తోందన్నారు. మ్యూచువల్ ఫండ్ సంస్థలన్నీ కలిసి ఈ అసోసియేషన్‌ను ప్రారంభించాయన్నారు. సెబీ నియమావళిని ఎప్పటికప్పుడు తమతో పంచుకుంటుందని, తమ నుంచి సూచనలు కూడా స్వీకరిస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంస్థ మార్కెటింగ్, ఇన్వెస్ట్‌మెంట్ ఎడ్యుకేషన్ అసిస్టెంట్ వైస్ ప్రెసిడెంట్ మమత ముదిలియార్ వైద్య తదితరులు పాల్గొన్నారు.

ఏపీలో రూ.89 వేల కోట్ల పెట్టుబడులు

ఆంధ్రప్రదేశ్‌లో రూ.89 వేల కోట్లు మ్యూచువల్ ఫండ్స్‌లో పెట్టుబడులు పెట్టారని నాగేశ్వర్ చెప్పారు. వీటిలో రూ.65 వేల కోట్లు ఈక్విటీలో, రూ.15 వేల కోట్లు ఫిక్స్‌డ్ ఇన్‌కం విభాగంలో, మిగిలినవి బ్యాలెన్స్‌డ్‌గా ఉన్నాయని తెలిపారు.

ఆర్టీసీలో అప్రెంటిస్‌షిప్‌నకు దరఖాస్తుల ఆహ్వానం



డాబాగార్డెన్స్: ఏపీఎస్‌ఆర్టీసీలో అప్రెంటిస్‌షిప్‌నకు దరఖాస్తులు ఆహ్వానిస్తోంది. విశాఖ జిల్లాకు సంబంధించి డీజిల్ మెకానిక్, మోటార్ మెకానిక్, పెయింటర్, అనకాపల్లి జిల్లాకు సంబంధించి డీజిల్ మెకానిక్, మోటార్ మెకానిక్, శ్రీకాకుళం, పార్వతీపురం మన్యం జిల్లాకు సంబంధించి డీజిల్ మెకానిక్, విజయనగరం జిల్లాకు సంబంధించి మెషినిస్ట్, డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ కోనసీమ జిల్లాకు సంబంధించి డీజిల్ మెకానిక్, మోటార్ మెకానిక్, వెల్డర్, కాకినాడ జిల్లాకు సంబంధించి డీజిల్ మెకానిక్, మోటార్ మెకానిక్, వెల్డర్, తూర్పు గోదావరి జిల్లాకు సంబంధించి డీజిల్ మెకానిక్, మోటార్ మెకానిక్ ట్రేడ్స్‌లో ఖాళీలు ఉన్నాయి. ఐటీఐ పూర్తిచేసిన అభ్యర్థులు www.apprenticeshipindia.gov.in వెబ్‌సైట్ ద్వారా ఈ నెల 31లోగా దరఖాస్తు చేసుకోవాలి. అభ్యర్థులు ఆయా తేదీల్లో ఉదయం 10 గంటలకు విజయనగరంలోని వీటీ అగ్రహారం గల జోనల్ స్టాఫ్ ట్రైనింగ్ కాలేజీలో హాజరుకావాలి.

సర్టిఫికెట్ల పరిశీలన తేదీలు : విశాఖపట్నం, అనకాపల్లి జిల్లాల అభ్యర్థులకు నవంబర్ 6న, విజయనగరం, పార్వతీపురం మన్యం జిల్లా, శ్రీకాకుళం జిల్లాకు చెందిన అభ్యర్థులు నవంబర్ 7న, డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ కోనసీమ, తూర్పుగోదావరి, కాకినాడ జిల్లాల అభ్యర్థులు నవంబర్ 8న హాజరుకావాలి. ఒక జిల్లాలో సంబంధిత ట్రేడ్‌లో ఖాళీలు లేనిచో వేరే జిల్లాలో పనిచేసేందుకు అంగీకార పత్రం సర్టిఫికెషన్ సమయంలో రాసి ఇవ్వాలి. మరిన్ని వివరాలకు 08922–294906 నంబర్‌లో సంప్రదించవచ్చు.

పంచాయతీరాజ్‌లో అడ్డగోలు బదిలీలపై విచారణ

- విచారణ అధికారిగా జెడ్పీ సీఈవోను నియమించిన కలెక్టర్
- ఉమ్మడి విశాఖ జిల్లా అధికారుల నుంచి వివరాల సేకరణ

సాక్షి ఎఫెక్ట్..

మహారాణిపేట: పంచాయతీరాజ్ కార్యనిర్వహణాధికారి అండ్ రూరల్ డెవలప్‌మెంటు (ఈవోపీఆర్ అండ్ ఆర్‌డీ) బదిలీలపై ఎట్టకేలకు విచారణ చేపట్టారు. గత నెల 28,29న తేదీల్లో అడ్డగోలు బదిలీలపై సాక్షిలో వరుస కథనాలు ప్రచురితమయ్యాయి. బదిలీల ప్రక్రియలో డబ్బులు చేతులు మారడంతో అధికారులు విచారణ ప్రారంభించారు. అల్లూరి సీతారామరాజు జిల్లాలో పనిచేస్తున్న అనేక మంది ఈవోపీఆర్ అండ్ ఆర్‌డీలు మైదాన ప్రాంతానికి రాలేకపోవడం, ప్రతి బదిలీకి డబ్బులు డిమాండ్ చేసినట్టు ఆరోపణలు వచ్చాయి. దీంతో పాటు గత నెల 22న బదిలీలు చేయగా, వాటిని 30వ తేదీ వరకు రహస్యంగా ఉంచడంపై కూడా విమర్శలు వచ్చాయి. దీనిపై కూడా విచారణ చేస్తున్నారు. బదిలీల ప్రక్రియలో నిబంధనలు పాటించలేదని కలెక్టర్ హరేంధిర ప్రసాద్‌కు కూడా పలువురు ఫిర్యాదు చేశారు. దీంతో జిల్లా పరిషత్ ముఖ్య కార్యనిర్వహణాధికారి నారాయణమూర్తిని విచారణ అధికారిగా కలెక్టర్ నియమించారు. సోమవారం జెడ్పీ సీఈవో నారాయణమూర్తి విచారణ చేపట్టారు. అనకాపల్లి జిల్లా, అల్లూరి జిల్లా అధికారుల నుంచి కూడా వివరాలు సేకరిస్తున్నారు.

తుపాను హెచ్చరికలపై జీవీఎంసీ అప్రమత్తం

డాబాగార్డెన్స్: బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం బుధవారం నాటికి తుపానుగా మారే అవకాశం ఉన్నందున, పరిస్థితుల్ని ఎదుర్కొనేందుకు జీవీఎంసీ యంత్రాంగం సన్నద్ధంగా ఉందని జీవీఎంసీ కమిషనర్ సంపత్‌కుమార్ తెలిపారు. నగరంలోని కొండవాలు, లోతట్టు ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని హెచ్చరించారు. ఈ విషయమై జిల్లా కలెక్టర్ ఎంఎన్ హరేంధిర ప్రసాద్ జీవీఎంసీ యంత్రాంగాన్ని టెలీకాన్ఫరెన్స్ ద్వారా ఆదేశించినట్లు తెలిపారు. తుపాను ప్రభావం వల్ల ప్రజలకు ఎటువంటి ఇబ్బందుల్లేకుండా పునరావాస కేంద్రాలు సిద్ధం చేసినట్లు కమిషనర్ వెల్లడించారు. తుపాను ఇబ్బందులు, సహాయం కోసం జీవీఎంసీ టోల్ ఫ్రీ 1800 4250 0009 నంబర్ ద్వారా సంప్రదించవచ్చన్నారు.

జీవీఎంసీకి రూ.39.19 లక్షల ఆదాయం

డాబాగార్డెన్స్: జీవీఎంసీ వాహనాలకు హెచ్‌పీసీఎల్ ఇంధనం వినియోగించడం ద్వారా జీవీఎంసీకి రూ.39.19 లక్షల లాయల్టీ పాయింట్ల ద్వారా ఆదాయం సమకూరిందని జీవీఎంసీ కమిషనర్ సంపత్‌కుమార్ తెలిపారు. జీవీఎంసీ ప్రధాన కార్యాలయ సమావేశ మందిరంలో సోమవారం హెచ్‌పీసీఎల్ లాయల్టీ పాయింట్ల ద్వారా జీవీఎంసీకి చేకూరిన చెక్కును హెచ్‌పీసీఎల్ రీజినల్ మేనేజర్ బి.రవికాంత్ నుంచి కమిషనర్ స్వీకరించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ జీవీఎంసీ మెకానికల్ విభాగం ద్వారా జీవీఎంసీకి చెందిన అన్ని వాహనాలకు హెచ్‌పీసీఎల్ ఇంధనం వినియోగించడం ద్వారా రూ.39.19 లక్షల ఆదాయం లభించిందని, విశాఖ నగరంలోనే హెచ్‌పీసీఎల్ ఇంధనం సరఫరా చేసే పరిశ్రమలు, సంస్థల్లో జీవీఎంసీ ప్రథమ స్థానంలో నిలవడమే గాక మూడేళ్ల కాలానికి గాను అత్యధిక లాయల్టీ పాయింట్లు జీవీఎంసీ పొందడం ద్వారా ఈ ఆదాయం చేకూరిందన్నారు. ఈ ఆదాయం లబ్ధిలో సృజనాత్మకంగా విధులు నిర్వహించిన జీవీఎంసీ మెకానికల్ విభాగం ఇంజినీర్లను కమిషనర్ అభినందించారు. కార్యక్రమంలో జీవీఎంసీ ప్రధాన ఇంజినీరు శివప్రసాదరాజు, పర్యవేక్షక ఇంజనీర్ గోవిందరావు తదితరులు పాల్గొన్నారు.

దద్దరిల్లిన కలెక్టరేట్

వలు సమస్యలపై నిరసనలతో కలెక్టరేట్ సోమవారం దద్దరిల్లింది. పెండింగ్ జీతాలు ఇవ్వాలని కోరుతూ 108 ఎంప్లాయిస్ యూనియన్... శానిటరీ వర్కర్లకు జీతాలను తక్షణమే చెల్లించాలని కోరుతూ శానిటేషన్ వర్కర్స్ యూనియన్.. జీవీఎంసీ 34వ వార్డు భూపేష్‌నగర్ ఏరియాలో మద్యం షాపు ఏర్పాటును నిరసిస్తూ స్థానిక మహిళలు ఆందోళన చేశారు.

108 సిబ్బంది ఆందోళన



నిరసన తెలుపుతున్న 108 సిబ్బంది

మహారాణిపేట: పెండింగ్ జీతాలు ఇవ్వాలని కోరుతూ 108 సిబ్బంది ఎంప్లాయిస్ యూనియన్ ఆధ్వర్యంలో ఆందోళనకు దిగారు. గత రెండు నెలలుగా సిబ్బందికి జీతాలు ఇవ్వడం లేదని, వార్షిక ఇంక్రిమెంట్లు పెండింగ్‌లో ఉన్నాయని యూనియన్ జిల్లా అధ్యక్షుడు ఎస్.బంగారాజు తెలిపారు. ఇతర సమస్యలు కూడా పెండింగ్‌లో ఉన్నాయని, సమస్యలను పరిష్కరించకపోతే ఆందోళన ఉధృతం చేస్తామని హెచ్చరించారు. అనంతరం వినతిపత్రాన్ని కలెక్టర్‌కు అందజేశారు.

జీతాలు చెల్లించాలని శానిటరీ వర్కర్ల నిరసన



ధర్నా చేస్తున్న మహిళలు

మహారాణిపేట: ప్రభుత్వ పాఠశాలల్లో పని చేస్తున్న శానిటరీ వర్కర్లకు బకాయి జీతాలను తక్షణమే చెల్లించాలని కోరుతూ ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ పాఠశాలలు, కళాశాల శానిటేషన్ వర్కర్స్ యూనియన్(సీఐటీయూ) జిల్లా ఆధ్వర్యంలో మహిళలు నిరసన ప్రదర్శన చేపట్టారు. అమ్మ ఒడి డబ్బుల నుంచి వెయ్యి రూపాయలు మినహాయించి శానిటరీ వర్కర్లకు జీతాలు చెల్లించేవారని, ఇప్పుడు ఆ పరిస్థితి లేదని, ప్రభుత్వం నేరుగా వేతనాలు చెల్లించాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షురాలు పి.మణి తెలిపారు. నెలకు రూ.6 వేలు వేతనంతో పనిచేస్తున్న శానిటరీ వర్కర్లకు పనిభారం పెరుగుతోందన్నారు. ప్రస్తుతం 300 మంది విద్యార్థులకు ఒక శానిటరీ వర్కర్ ఉన్నారని, పనిభారం పెరుగుతోందని.. 100 మందికి ఒకరు చొప్పున నియమించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి జి.మంగ, ఇతర నాయకులు పాల్గొన్నారు.

మా ప్రాంతంలో మద్యం షాపులొద్దు



ఆందోళన చేస్తున్న మహిళలు

మహారాణిపేట : జీవీఎంసీ 34వ వార్డు భూపేష్ నగర్‌లో మద్యం షాపు ఏర్పాటు చేయొద్దని స్థానికులు నిరసన తెలిపారు. సీఐటీయూ జగదాంబ జోన్ కమిటీ ఆధ్వర్యంలో కొంత మంది మహిళలు కలెక్టరేట్ వద్ద నిరసన తెలిపారు. ఈ ప్రాంతంలో ఇప్పటికే రెండు బార్లు, మూడు వైన్ షాపులు ఉన్నాయని... అక్కడే మరో వైన్ షాప్ ఏర్పాటు చేస్తే స్థానికంగా గొడవలు పెరుగుతాయని ఆందోళన వ్యక్తం చేశారు. ఇలా పక్కపక్కనే మద్యం షాపుల ఏర్పాటు నిబంధనలకు విరుద్ధమని వాపోయారు. సీఎం చంద్రబాబు ఎక్కడికక్కడ వైన్ షాపులు ఏర్పాటు చేసి మహిళలకు రక్షణ లేకుండా చేస్తున్నారని మహిళలు ఆరోపించారు. పలువురు ప్లకార్డులు పట్టుకుని ఆందోళన చేశారు. అనంతరం కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు.

లీవ్ ఎన్‌క్యాష్‌మెంట్ నిధుల దుర్వినియోగంపై ఆందోళన



ప్రసంగిస్తున్న సీఐటీయూ ప్రధాన కార్యదర్శి రామస్వామి

ఉక్కునగరం: ఇటీవల ఫండ్ నుంచి విత్‌డ్రా చేసిన నిధులను లీవ్ ఎన్‌క్యాష్‌మెంట్ అవసరాలకు మాత్రమే వినియోగించాలని స్టీల్ సీఐటీయూ ప్రధాన కార్యదర్శి యు. రామస్వామి డిమాండ్ చేశారు. సోమవారం సీఐటీయూ మిత్రపక్షాల ఆధ్వర్యంలో ఈ అంశంపై ఉక్కు అడ్మిన్ కూడలి వద్ద ధర్నా చేశారు. అప్పటి యాజమాన్యం ఉద్యోగులు పదవీ విరమణ చేసేటప్పుడు ఇచ్చే లీవ్ ఎన్‌క్యాష్‌మెంట్ భవిష్యత్ అవసరాల కోసం పదేళ్ల క్రితం రూ. 300 కోట్లు బ్యాంక్‌లో ఫండ్‌గా డిపాజిట్ చేసిందన్నారు. అది ఇప్పటికి రూ. 600 కోట్లకు చేరుకుందన్నారు. అయితే ఇటీవల యాజమాన్యం అందులో నుంచి రూ. 390 కోట్లు ఇతర అవసరాల కోసం విత్‌డ్రా చేయడం అన్యాయమన్నారు. వెంటనే ఆ నిధులను ఫండ్‌కు జమ చేయాలన్నారు. అదే విధంగా ఉద్యోగుల పీఎఫ్ అమౌంట్ ట్రస్ట్‌కు జమ చేయడం లేదని ఆందోళన వ్యక్తం చేశారు. అదే విధంగా థ్రిఫ్ట్ సొసైటీకి కూడా లోన్ రికవరీ సొమ్ము చెల్లించడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఫ్యామిలీ బెనిఫిట్ స్కీమ్ ద్వారా లబ్ధి పొందిన కార్మికుల కుటుంబ సభ్యులకు చెల్లించాల్సిన డిపాజిట్ అమౌంట్ ఇవ్వటం లేదని పేర్కొన్నారు. ఈ విధంగా ఆర్థిక ఇబ్బందులు సృష్టిస్తే ఉద్యోగులు ఏ విధంగా ఉత్సాహంగా పని చేస్తారని ఆయన ప్రశ్నించారు. వెంటనే యాజమాన్యం ఉత్పత్తి, ఉత్పాదకత పెంపునకు కృషి చేయడం ద్వారా ఉద్యోగులను ప్రోత్సహించే విధంగా చర్యలు చేపట్టాలన్నారు. కార్యక్రమంలో కూటమి నాయకులు డి.వి. రమణారెడ్డి, సన్యాసిరావు, సురేష్‌బాబు పాల్గొన్నారు.

ఊపిరిపోసిన కేజీహెచ్ వైద్యులు

- చావుబతుకుల మధ్య ఉన్న రోగికి పునర్జన్మ



రోగిని పరామర్శిస్తున్న కేజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ శివానంద్, చిత్రంలో పలువురు వైద్యులు

మహారాణిపేట: ప్రాణాపాయంలో రోగికి కేజీహెచ్ వైద్యులు ప్రాణం పోశారు. శస్త్ర చికిత్స చేసినా రోగి చనిపోతాడని వివిధ ఆస్పత్రుల వైద్యులు చెప్పినప్పటికీ కేజీహెచ్ వైద్యులు మాత్రం పునర్జన్మ ప్రసాదించారు. వైద్యుల సమన్వయంలో ఆపరేషన్ విజయంతంగా పూర్తి చేసి ఆ కుటుంబంలో ఆనందాన్ని నింపారు. వివరాలు ఇలా...అనకాపల్లి జిల్లా అచ్యుతాపురం ప్రాంతానికి చెందిన హరికృష్ణ కొంతకాలంగా ఊపిరితిత్తుల సమస్యతో బాధపడుతున్నాడు. దగ్గుతోపాటు రక్తం కూడా పడుతోంది. గ్రానైట్ కంపెనీలో పనిచేస్తూ జీవనం సాగిస్తున్న హరికృష్ణ తీవ్ర అనారోగ్యానికి గురవడంతో బంధువులు చాలా ఆస్పత్రుల్లో చూపించారు. చివరికి హైదరాబాద్‌లోని నిమ్స్‌ను సంప్రదించారు. శస్త్ర చికిత్సకు రూ.10 నుంచి రూ15 లక్షల వరకు ఖర్చు అవుతుందని, అయితే ప్రాణాలకు గ్యారెంటీ లేదని, ఆపరేషన్ చేసినా రోగి మృతి చెందడానికే ఎక్కువ అవకాశాలున్నాయని వైద్యులు తేల్చి చెప్పడంతో బంధువులు అనకాపల్లి తీసుకొచ్చేశారు. అంత డబ్బులు ఖర్చు చేసే స్తోమత కూడా లేకపోవడంతో స్థానికులు సలహా మేరకు ఈ నెల పదో తేదీన కేజీహెచ్‌కు తీసుకొచ్చారు. వైద్యులు మణిత, పద్మజ పర్యవేక్షణలో వివిధ పరీక్షలు నిర్వహించారు. కార్డియోథొరాసిక్ వార్డులో రోగిని ఉంచి వైద్యం ప్రారంభించారు. పల్మనరీ ఆర్టెరీలో త్రోమ్‌బస్ అనే వ్యాధితో రోగి బాధపడుతున్నాడని పరీక్షల్లో నిర్ధారణ అయింది. అంతేకాకుండా పల్మనరీ ఆర్టెరీ ఎడుమ వైపు నుంచి కూడి వైపు కూడా విస్తరించింది. దీని వల్ల ఆ ఆర్టెరీ మూసుకుపోయింది. ఈ సమయంలో ఆపరేషన్ చేస్తే రోగి ప్రాణానికి ముప్పు వాటిల్లితుంది. కేజీహెచ్‌లో పలువిభాగాల వైద్యుల సమన్వయంగా ఈనెల 11న రోగికి శస్త్ర చికిత్స నిర్వహించారు. బైపాస్ తరహాలో శస్త్ర చికిత్స చేసి గుండెలో క్లాట్ అయిన రక్తాన్ని, ఇతర భాగాలను తొలగించారు. డాక్టర్ మణిత, డాక్టర్ పద్మజ ఆధ్వర్యంలో ఈ శస్త్ర చికిత్స చేసి 8ఇన్‌టూ3 సెంటీ మీటర్లు పరిధిలో క్లాట్ అయిన రక్తాన్ని తొలగించారు. ఇప్పుడు రోగి ఆరోగ్యంగా ఉన్నాడు. వృత్తి రీత్యాగాని, వంశపారంపర్యంగా ఇలాంటి వ్యాధులు వెయ్యి మందిలో ఒకరికి వస్తాయని డాక్టర్ పద్మజ పేర్కొన్నారు. ఇప్పుడు రోగి పోస్టు ఆపరేటివ్ వార్డులో చికిత్స పొందుతున్నాడని, తొలగించిన రక్త నమూనాలు, ఇతర భాగాలను పరీక్షలకు పంపినట్టు వివరించారు. త్వరలో డిశ్చార్జ్ చేస్తామని డాక్టర్ పద్మజ తెలిపారు. ఆరోగ్యశ్రీలో ఉచితంగా శస్త్ర చికిత్స నిర్వహించారు. శస్త్ర చికిత్సలో డాక్టర్ సతీష్, డాక్టర్ రమేష్, భవానీ (ఎనస్తీషియా) స్టాఫ్ నర్సులు ఝూన్సీ, వరలక్ష్మి, దుర్గా, జ్యోతి, నవ్య తదితరులు సహకారం అందించారు. సోమవారం రోగిని కేజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ పి.శివానంద్ పరామర్శించారు. ప్రాణాలు కాపాడిని వైద్యులను ఆయన అభినందించారు.

బైక్ కొనలేదని విద్యార్థి ఆత్మహత్య

పుట్టిన రోజు నాడు విషాదం



పేరిశెట్టి గణేష్ (ఫైల్)

పీఎంపాలెం: పుట్టిన రోజు నాడు విషాద సంఘటన చోటుచేసుకుంది. తండ్రి బైక్ కొనలేదని కోపంతో ఓ ఇంటర్ విద్యార్థి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. తల్లిదండ్రులకు కడుపుకోత మిగిల్చాడు. ప్రాణస్నేహితులను దుఃఖ సాగరంలో ముంచెత్తాడు. పీఎంపాలెం గాయత్రీనగర్ జేఎన్ఎన్‌యూఆర్‌ఎం కాలనీలో సోమవారం జరిగిన సంఘటనకు సంబంధించిన సీఐ బాలకృష్ణ తెలిపిన వివరాలు.. పేరిశెట్టి సూర్యనారాయణ విజయనగరం జిల్లా బొబ్బిలి మండలం కోమటిపల్లి గ్రామం నుంచి సుమారు ఆరేళ్ల క్రితం నగరానికి వలస వచ్చాడు. ప్రస్తుతం ఓ కళాశాలలో హాస్టల్ కుక్‌గా పనిచేస్తూ పీఎంపాలెం గాయత్రీనగర్‌లో భార్య గంగ, పెద్ద కుమారుడు గణేష్ , 9వ తరగతి చదువుతున్న చిన్న కుమారుడు లోకేష్‌తో కలిసి నివసిస్తున్నాడు. పెద్ద కుమారుడు నగరంలోని ఓ కళాశాలలో ఇంటర్ ద్వితీయ సంవత్సరం చదువుతున్నాడు. సోమవారం పుట్టిన రోజు కావడంతో సాయంత్రం కేక్ కట్ చేయడానికి అన్ని ఏర్పాట్లు చేసుకున్నాడు. ఇంతలో ఏమైందో ఏమో ఇంటి తలుపులు వేసుకుని ఫ్యానుకు ఉరివేసుకుని ఆత్మహత్మకు పాల్పడ్డాడు. అనుకోని పరిణామంతో ఆందోళన చెందిన కుటుంబ సభ్యులు, స్థానికులు వేలాడుతున్న గణేష్‌ను కిందకు దించి చూడగా అప్పటికే మృతి చెందాడు. వెంటనే పోలీసులకు సమాచారం అందించారు. పోస్టుమార్టం నిమిత్తం కేజీహెచ్‌కు తరలించారు. విద్యార్థి తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని సీఐ బాలకృష్ణ తెలిపారు.

బైక్ కొనమని తండ్రితో గొడవ

విద్యార్థి గణేష్ ఎప్పటి నుంచో బైక్ కొనమని తల్లిదండ్రులను అడుగుతున్నాడు. బైక్ కొనే స్థోమత ఆ కుటుంబానికి లేదు. ఇదే విషయం తల్లిదండ్రులు గణేష్ నచ్చచెప్పినప్పటికీ వినేవాడు కాదు. ఈ విషయంపైనే తండ్రితో గొడవ పడినట్టు స్థానికులు చెబుతున్నారు. బైక్ కొనే స్థోమత లేకపోవడంతో మనస్థాపానికి గురై ఆత్మహత్యకు పాల్పడి ఉంటాడని అనుమానం వ్యక్తం చేస్తున్నారు.

స్వర్ణాంధ్ర విజేతలకు బహుమతుల అందజేత



విజేతలతో కలెక్టర్ హరేంధిర ప్రసాద్, డీఈవో చంద్రకళ, ఇతర అధికారులు

మహారాణిపేట: జిల్లా విద్యాశాఖాధికారి చంద్రకళ ఆధ్వర్యంలో స్వర్ణాంధ్ర-2047 విజన్‌లో భాగంగా నిర్వహించిన వ్యాసరచన, వక్తృత్వం, డిబేటింగ్ పోటీల్లో విజేతలకు కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిర ప్రసాద్ బహుమతులు అందజేశారు. గత నెల 30న పోటీలు నిర్వహించారు. విజేతలైన 63 మంది విద్యార్థులకు జిల్లా స్థాయిలో పోటీలు నిర్వహించారు. జిల్లా స్థాయి విజేతలకు కలెక్టర్ సోమవారం సర్టిఫికెట్లు, మెడల్స్ అందజేశారు. వ్యాసరచన పోటీలో ప్రథమ స్థానం పొందిన కె. విరాజిత (జిల్లా పరిషత్ హైస్కూలు, చింతల అగ్రహారం), ద్వితీయ స్థానం ఎల్.జ్యోత్స్న (కేజీబీవీ.ఆనందపురం), తృతీయ స్థానం ఎం.సిద్ర సుల్తానా (ప్రభుత్వ క్వీన్ మేరీ హైస్కూలు, పాత పోస్టాఫీసు), డిబేట్ పోటీల్లో ప్రథమ స్థానంలో కె.సుహాసిని గీతిక, కె.వర్షిణి (జిల్లా పరిషత్ హైస్కూలు, నడుపూరు), ద్వితీయ స్థానంలో పి.సుస్మిత ప్రియాంక, జేవీఎస్ ప్రీతి, (జిల్లా పరిషత్ హైస్కూలు, చిట్టివలస), తృతీయ స్థానంలో జె.భేవ్‌సారీ, ఎస్.అక్షయ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల (సునీల్ శర్మకాలనీ), వక్తృత్వ పోటీల్లో ప్రథమ స్థానం ఆర్.భరద్వాజ్ (జీవీఎంసీ ఉన్నత పాఠశాల, ప్రకాశరావుపేట), ద్వితీయ స్థానంలో పి.అచ్చుతరావు (పెద నరవ), తృతీయ స్థానం కె.సుహానీ గీతిక (జిల్లా పరిషత్ హైస్కూలు నడుపూరు) తదితరులకు కలెక్టర్ బహుతులు అందజేశారు.

అవే ఫిర్యాదులు రిపీట్ కాకూడదు

- పీజీఆర్ఎస్ వినతులపై కలెక్టర్ సమీక్ష



వినతులు స్వీకరిస్తున్న ఆర్డీవో శ్రీలేఖ

మహారాణిపేట: ఒకే సమస్యపై తరుచూ ఫిర్యాదులు రాకూడదని, ప్రజలిచ్చే వినతులను తక్షణం పరిష్కరించాలని కలెక్టర్ హరేంధిర ప్రసాద్ అధికారులను ఆదేశించారు. స్థానిక కలెక్టరేట్ మీటింగ్ హాలులో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్)లో ప్రజల నుంచి ఆయన వినతులు స్వీకరించారు. ముందుగా గత వారం వచ్చిన వినతులపై అధికారులు తీసుకున్న చర్యలపై సమీక్షించారు. నిర్దేశిత కాలంలో ఫిర్యాదులను పరిష్కరించాలని, మళ్లీమళ్లీ అవే ఫిర్యాదులు రాకుండా జాగ్రత్త వహించాలని సూచించారు. అవసరమైతే జిల్లాస్థాయి అధికారులు ఫిర్యాదుదారులతో మాట్లాడాలని, పూర్వాపరాలు తెలుసుకొని సంతృప్తికర స్థాయిలో పరిష్కారం చూపాలన్నారు.


పీజీఆర్ఎస్‌కు 230 వినతులు

సోమవారం జరిగిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్)కు ప్రజల నుంచి వివిధ సమస్యలపై 230 వినతులు అందాయి. వాటిలో రెవెన్యూ విభాగానికి 84, జీవీఎంసీకి 65, పోలీసు శాఖకు 12, ఇతర శాఖలకు సంబంధించి 69 ఉన్నాయి. జాయింట్ కలెక్టర్ కె. మయూర్ అశోక్, జిల్లా రెవెన్యూ అధికారి కె. మోహన్ కుమార్, ఆర్డీవో పి. శ్రీలేఖ, జీవీఎంసీ ఏడీసీ వర్మ, ఇతర విభాగాల ఉన్నతాధికారులు ప్రజల నుంచి వినతులు స్వీకరించారు.

స్టీల్‌ప్లాంట్ కార్మిక సమ్మెను విరమించండి

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ కార్మిక సంఘాలు ఈనెల 28న తలపెట్టిన కార్మిక సమ్మెను విరమించుకోవాలని కేంద్ర కార్మిక శాఖ రీజనల్ లేబర్ కమిషనర్ (ఆర్‌ఎల్‌సీ) కె.జె. మొహంతి కార్మిక సంఘాల నాయకులను కోరారు. సమ్మె నేపథ్యంలో సోమవారం ఉక్కు యాజమాన్యం ప్రతినిధులు, కార్మిక సంఘాల నాయకులతో ఆర్‌ఎల్‌సీ కార్యాలయంలో సమావేశం ఏర్పాటు చేశారు. సమావేశంలో స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణ ఉపసంహరించాలని, స్టీల్‌ప్లాంట్‌ను సెయిల్‌లో విలీనం చేయాలని కార్మిక నాయకులు డిమాండ్ చేశారు. ఎల్‌టీసీ, ఎల్‌టీఏ, ఎల్ఎల్‌టీసీ, హెచ్‌ఆర్‌ఏ నిలుపుదల చేస్తూ ఇచ్చిన ఉత్తర్వులు ఉపసంహరించాలని, పెంచిన కరెంటు చార్జీలు తగ్గించాలన్నారు. ప్లాంట్ 7.3 మి.ట సామర్థ్యంతో నడపాలని, స్టీల్‌ప్లాంట్‌కు సొంత గనులు కేటాయించాలన్నారు. దీంతో పటు పలు సమస్యలను యాజమాన్యం దృష్టికి తీసుకొచ్చారు. యాజమాన్యం ప్రతినిధులు మాట్లాడుతూ ప్రైవేటీకరణ యాజమాన్యం పరిధిలో లేదన్నారు. ప్లాంట్ ఆర్థిక ఇబ్బందులో ఉన్నందున ఎల్‌టీసీ, ఎల్‌టీఏ, హెచ్‌ఆర్‌ఏ చెల్లింపు వాయిదా వేశామన్నారు. పరిస్థితులు చక్కబడిన తర్వాత వాటిని చెల్లిస్తామన్నారు. ఏపీఈపీడీసీఎల్ నుంచి కొనుగోలు చేసిన రేట్లను తాము ఉద్యోగుల నుంచి తీసుకుంటున్నామన్నారు. ఆర్థిక పరిస్థితి బాగా లేనందున 7.3 మి.ట సామర్థ్యంతో ప్లాంట్‌ను నడపలేకపోతున్నామన్నారు. ఆర్థిక పరిస్థితి బాగోలేనందున బోనస్ చెల్లించ లేకపోతున్నామన్నారు. సమావేశంలో హెచ్‌ఆర్ డీజీఎం హెచ్.ఎం. సైగల్, వివిధ కార్మిక సంఘాల నాయకులు డి. ఆదినారాయణ, జె. రామకృష్ణ, పి.వి. రమణమూర్తి, కారు రమణ, యు. రామస్వామి, జి. గణపతిరెడ్డి, ఎం .మహాలక్ష్మినాయుడు, వి.రామ్మోహన్‌కుమార్‌లు పాల్గొన్నారు.

జూనియర్ అసిస్టెంట్ ఆత్మహత్య



పద్మనాభరావు (ఫైల్)

భీమునిపట్నం: పురుగు మందు తాగి ఆత్మహత్యకు పాల్పడిన వ్యక్తి చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందాడు. భీమిలికి చెందిన సీల అనంత పద్మనాభరావు(56) గాజువాక తహసీల్దారు కార్యాలయంలో జూనియర్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్నాడు. అతనికి భార్య విశాలాక్షి, కుమార్తె సాయిదేవి ఉన్నారు. అతడు కొంత కాలంగా మానసిక సమస్యలు, అనారోగ్యంతో బాధపడుతున్నారు. ఈ నేపథ్యంలో శనివారం ఇంట్లో నుంచి వెళ్లిపోయి తిరిగి రాలేదు. ఆదివారం బీచ్‌రోడ్డులోని కొబ్బరి చెట్ల పార్కు వద్ద అతను పురుగు మందు తాగి అపస్మారక స్థితిలో ఉండడాన్ని పోలీసులు గుర్తించి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ సోమవారం చనిపోయాడు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

జీవీఎంసీకి 77 వినతులు



దివ్యాంగుడి నుంచి వినతి స్వీకరిస్తున్న సంపత్ కుమార్

డాబాగార్డెన్స్: జీవీఎంసీ ప్రధాన కార్యాలయ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికకు 77 వినతులు అందాయి. కమిషనర్ సంపత్‌కుమార్ అధికారులతో కలిసి ఫిర్యాదులు స్వీకరించారు. జోన్-1 నుంచి రెండు, జోన్-2కు ఎనిమిది, జోన్-3కు 14, జోన్-4 కు ఐదు, జోన్-6కు 16, జోన్-7కి ఒకటి, జోన్-8కి తొమ్మిది ఫిర్యాదులు అందగా, జీవీఎంసీ ప్రధాన కార్యాలయానికి సంబంధించి 17 ఫిర్యాదులు అందాయి. కార్యక్రమంలో అదనపు కమిషనర్లు డీవీ రమణమూర్తి, ఆర్ సోమన్నారాయణ, ప్రధాన ఇంజినీర్ శివప్రసాదరాజు, ప్రధాన వైద్యాధికారి నరేష్‌కుమార్, డీసీ (రెవెన్యూ) శ్రీనివాసరావు పలువురు అధికారులు పాల్గొన్నారు.

ప్రజా ఫిర్యాదులు వెంటనే పరిష్కరించండి

జీవీఎంసీ నిర్వహించే ప్రజా సమస్యల పరిష్కార వేదికలో వచ్చిన ప్రజా ఫిర్యాదులను వెంటనే పరిష్కరించాలని జీవీఎంసీ కమిషనర్ పి. సంపత్ కుమార అధికారులను ఆదేశించారు. జీవీఎంసీ ప్రధాన కార్యాలయ సమావేశ మందిరంలో సోమవారం జీవీఎంసీకి సంబంధించిన ప్రజా ఫిర్యాదులు, కోర్టు కేసులు, ఆడిట్ అభ్యంతరాలు, ఈ-ఆఫీస్ అమలు తదితర అంశాల పై జీవీఎంసీ విభాగాధిపతులు, స్టేట్ ఆడిట్ రీజనల్ డైరెక్టర్ సీతారామారావు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అన్ని జోనల్ కమిషనర్లతో సమీక్షా సమావేశం నిర్వహించారు. సమావేశంలో కమిషనర్ సంపత్ కుమార్ మాట్లాడుతూ ప్రజలకు మౌలిక సదుపాయాలు కల్పించడం, సంక్షేమ పథకాలు, సేవలు అందివ్వడంలో ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇస్తోందన్నారు. కార్యక్రమంలో ప్రధాన ఇంజినీరు శివప్రసాదరాజు, అదనపు కమిషనర్ డీవీ రమణమూర్తి, ఎగ్జామినర్ ఆఫ్ అకౌంట్స్ వాసుదేవరెడ్డి, ఫైనాన్స్ అడ్వైజర్ మల్లికాంబ పాల్గొన్నారు.

ఫిర్యాదుల పరిష్కారంలో అలసత్వం వద్దు

విశాఖ సిటీ: ప్రజా సమస్యల పరిష్కార వేదిక(పీజీఆర్ఎస్)లో వచ్చిన ఫిర్యాదుల పరిష్కారంలో అలసత్వం వహించవద్దని నగర పోలీస్ కమిషనర్ డాక్టర్ శంఖబ్రత బాగ్చి పోలీస్ అధికారులను ఆదేశించారు. సోమవారం పోలీస్ సమావేశ మందిరంలో నిర్వహించిన పీజీఆర్ఎస్‌కు 98 ఫిర్యాదులు వచ్చాయి. సీపీ స్వయంగా ఫిర్యాదుదారులతో మాట్లాడి వారి సమస్యలను తెలుసుకున్నారు. వాటిపై వెంటనే సంబంధిత స్టేషన్ అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా మాట్లాడి సత్వరమే పరిష్కరించాలని చెప్పారు.